



రవీంద్రభారతిలో బతుకమ్మను తయారు చేస్తున్న విద్యార్థినులు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విజన్ టాలెంట్ స్కూల్ విద్యార్థినులు





కూకట్‌పల్లి అయ్యప్ప స్వామి దేవాలయంలో బతుకమ్మ వేడుకలు







పూల పండగ వచ్చేసింది

ఎంగిలిపూల బతుకమ్మకు ప్రత్యేక పూజలు

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



వెంకట్రావ్‌నగర్‌లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

కూకట్‌పల్లి: తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ గురువారం కూకట్‌పల్లిలో ఘనంగా ప్రారంభమయ్యింది. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మను తయారు చేశారు. గౌరమ్మను పూజించి బతుకమ్మ చుట్టు ఆడిపాడారు. కూకట్‌పల్లి ప్రధాన చౌరస్తా అయిన హనుమాన్ చౌక్ వద్దకు మహిళలు బతుకమ్మలను తీసుకొచ్చి ఆడిపాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అమావాస్యకు ముందు బతుకమ్మ వేడుకలను నిర్వహించి తమ సంప్రదాయాన్ని కొనసాగించటం విశేషం. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు బతుకమ్మ చుట్టూ పాటలు పాడుతూ సీనియర్ సిటిజన్స్ కూడా ఈ ఆనందంలో భాగస్వాములు కావటం విశేషం. అనంతరం సమీపంలో ఉన్న రంగధాముని చెరువు వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు. అనంతరం బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు. కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ మహిళలకు ఇబ్బందులు కలగకుండా కావాల్సిన అన్ని వసతులు కల్పించారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు కంచనపల్లి నాగరాజు, నాయినేని సూర్యారావు, తులసీరావు, రమేష్‌రావు బృందం వేడుకలను పర్యవేక్షించారు.

పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు

కూకట్‌పల్లి: హైదర్‌నగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులందరూ వివిధ రకాల పూలను పేర్చి బతుకమ్మలను తయారు చేశారు. అనంతరం గౌరమ్మ, బతుకమ్మకు పూజలు ఆడిపాడారు. ఈ సందర్భంగా హెచ్ ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు తెలియాలనే ఉద్దేశంతో బతుకమ్మ పండగను నిర్వహించామని తెలిపారు.

విజన్ టాలెంట్ స్కూల్‌లో..

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని విజన్ టాలెంట్ స్కూలులో గురువారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మలను పేర్చి పాఠశాల ఆవరణలో బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆడి పాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చిన్న వయస్సు నుంచే తెలుసుకోవాలని పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

శంషీగూడ ఉన్నత పాఠశాలలో...

సాక్షి,సిటీబ్యూరో: కూకట్‌పల్లిలోని శంషీగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. వందల సంఖ్యలో విద్యార్థినులు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబేలా బతుకమ్మలను రంగు రంగుల పూలతో తీర్చిదిద్దారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు పూల పండుగ బతుకమ్మ అద్దం పడుతోందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహులు అన్నారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయినులు రామలక్ష్మి, సంధ్యారాణి, లతాశ్రీ, రమాదేవి, జ్యోతి, శ్రీదేవి, రమ, సదాలక్ష్మి, రవళి, సరిత తదితరులు పాల్గొని బతుకమ్మ ఆడారు.



శంషీగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు

కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ గుడ్‌విల్ చౌరస్తా నుంచి ఖాజానగర్ తదితర కాలనీల మీదుగా సాయి ఫంక్షన్‌హాల్ వరకు గురువారం కాంగ్రెస్ నేతలు గడప గడపకు జైపాల్ అన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పాదయాత్రలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జెరిపేటి జైపాల్ ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రాణ త్యాగాలతో తెచ్చుకున్న తెలంగాణ కొంతమంది పెత్తందారుల చేతుల్లో బంది అయిపోయిందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ అందించే 6 గ్యారంటీ హామీలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారెళ్ళ శ్రీనివాసరావు, పోచయ్య, రాజేందర్, కవిరాజ్, రూబెన్, అక్తర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో పాదయాత్ర చేపట్టిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జెరిపేటి జైపాల్

ఎమ్మెల్యే కృష్ణారావుకే మా మద్దతు: పాస్టర్స్



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు మద్దతు తెలుపుతున్న పాస్టర్స్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురు పాస్టర్స్ గురువారం మాధవరం కృష్ణారావును కలిసి మద్దతు తెలిపారు. నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు డేవిడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును పాస్టర్స్ కలిశారు. ఎమ్మెల్యే క్రిస్టియన్ సమాజానికి చేస్తున్న సేవలను గుర్తు చేస్తూ.. తమను ఆదరిస్తున్న మాధవరం కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తమ మద్దతు ఎమ్మెల్యేకే ఉంటుందన్నారు.

నేను బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నా..

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ థర్డ్ ఫేజ్‌లో తాను జనసేన పార్టీలో చేరినట్లు కొంతమంది నాయకులు ప్రకటించటం పట్ల కేపీహెచ్‌బీ కాలనీ బైక్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామారావు గురువారం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... తాను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు టీడీపీలో ఉన్నప్పటి నుంచి ఆయన వెంబడి ఉన్నానన్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నానని తెలిపారు. ఇది జనసేన నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని దుయ్యబట్టారు.

‘ప్రజలు బీఆర్‌ఎస్ నేతల మాటలు నమ్మరు’



పైపులైన్ రోడ్డులో జరిగిన బీజేపీ భరోసా యాత్రలో హరీష్‌రెడ్డి, రాజేశ్వరరావు తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని పైపులైన్ రోడ్డులో బీజేపీ భరోసా యాత్ర నిర్వహించారు. 62 రోజులుగా నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గడప గడపకు తిరుగుతూ బీజేపీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రోజురోజుకి బీజేపీకి ఆదరణ పెరుగుతోందని అన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరవేసేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకుల మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేన్నారు. కార్యక్రమంలో నాయకులు సూర్యారావు, సురేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కృష్ణాగౌడ్, కంచి మహేందర్, ఉదయ్‌కుమార్, రామ్మోహన్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ కాలనీ శ్రీకనకదుర్గాదేవి, శీతలాదేవి, కాళికాదేవి ఆలయంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు దోర్బాల కాశీనాథ్‌శర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహిళా భక్తులకు ప్రతి రోజు సాయంత్రం అమ్మవారి పసుపు, కుంకుమను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

అంబేడ్కర్‌నగర్‌లో..

మూసాపేట: మూసాపేటలోని అంబేడ్కర్‌నగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అమరజ్యోతి అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పాతపల్లి శివశంకర్ తెలిపారు. అమ్మవారి ప్రతిష్ఠానంతరం కంకుమార్చన, అన్నదానం, హోమం తదితర పూజలు ఉంటాయని పేర్కొన్నారు.

పాండురంగనగర్‌లో...

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వీఎన్‌వీ సత్యనారాయణ, కార్యనిర్వహణ అధికారి జీఏకే కృష్ణ గురువారం తెలిపారు.

రేపు బతుకమ్మ వేడుకలు

బాలానగర్: బాలానగర్ డివిజన్‌లో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలు ఈనెల 14న నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలు బతుకమ్మలతో శనివారం సాయంత్రం 5.30గంటలకు దుర్గామాత గుడి వద్దకు చేరుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలని అన్నారు.

బాల బతుకమ్మ పాట ఆవిష్కరణ



కూకట్‌పల్లి: సాయి అలేఖ్య సంస్థ సమర్పించిన బాల బతుకమ్మ పాటను గొట్టిముక్కల పాండురంగారావు సమక్షంలో గురువారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకురాలు అరుణ ఉపద్రష్ట మాట్లాడుతూ.. సాయి అలేఖ్య యూట్యూబ్ చానల్‌లో బాల బతుకమ్మ ఫుల్‌సాంగ్‌ను వీక్షించవచ్చన్నారు. ప్రతి చిన్నారి ఈ పాటను వీక్షించాలని కోరారు.

హెచ్‌సీయూలో డచ్ ప్రతినిధి బృందం



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీని డచ్ ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. ఈ బృందం ఇంటర్నేషనల్ అఫైర్స్ ఆఫీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ సమన్వయం చేశారు. డచ్ భాష, భారతీయ విద్యాసంస్థల మధ్య బలమైన బంధాన్ని పెంపొందించే దిశగా ఈ సందర్శన ఉంది. ఈ పర్యటనలో భాగంగా సెంటర్ ఫర్ అప్లైడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషనల్ స్టడీస్ హెడ్ ప్రొఫెసర్ అరుల్‌మొళి, ప్రొఫెసర్ జే ప్రభాకర్‌రావు, ఇంటర్నేషనల్ అఫైర్స్ ఆఫీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ చేతన శ్రీవాస్తవ, ఆఫీస్ ఫర్ ఇంటర్నేషనల్ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ అలోక్‌కుమార్ మిశ్రాతో సమావేశమయ్యారు. భారతదేశంలో డచ్ భాష, సంస్కృతిని ప్రోత్సహించడంలో ముఖ్యమైన మైలురాయిని గుర్తించడమే కాకుండా విద్య, భాష అధ్యయనాల రంగంలో అంతర్జాతీయ సహకారం పెంపొందించుకోవడమే ఈ పర్యటన లక్ష్యం.

శిక్షణతో స్వయం ఉపాధి

గచ్చిబౌలి: స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని టీఎస్‌ఎస్‌పీ కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ సి.సన్నీ పేర్కొన్నారు. గురువారం కొండాపూర్ బెటాలియన్‌లో మహిళల స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ముగింపు కార్యక్రమానికి జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ రామ్మోహన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.

ఆర్మీ అధికారి ఇంట్లో దోపిడీకి యత్నం

ఒకరి రిమాండ్, పరారీలో ఒకరు



పట్టుబడ్డ సమీర్



సీసీ కెమెరాల్లో సమీర్, శివ

సనత్‌నగర్: ఆర్మీ అధికారి ఇంట్లో దోపిడీకి యత్నించిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సార్టీకాలనీలోని 1049 నెంబర్ ఇంట్లో ఆర్మీలో మేజర్‌గా పనిచేస్తున్న అభిషేక్ కుటుంబం నివాసముంటుంది. అభిషేక్ విధి నిర్వహణలో భాగంగా అస్సాంలో ఉంటుండగా ఇంట్లో అతని తల్లి ప్రేమ (60) ఉంటుంది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉంటున్న ప్రేమ ఈ నెల 9న తాళం వేసి బయటకు వెళ్లింది. ఆ సమయంలో ఢిల్లీకి చెందిన సమీర్, శివ సమీపంలోనే ఉండి ఇదంతా గమనించారు. ప్రేమ బయటకు వెళ్లగానే ఇనుపరాడ్‌తో తలుపు గడియ విరగ్గొట్టి ఇంట్లో చోరీకి పాల్పడుతుండగా అలికిడి కావడంతో మొదటి అంతస్తులో ఉంటున్న ప్రేమ సోదరుడు లక్ష్మీనారాయణ (70) అక్కడికి వచ్చి కేకలు వేస్తూ దొంగలను అడ్డుకున్నాడు. ఈ క్రమంలో దొంగలు అతన్ని వెనక్కి నెట్టేయడంతో గాయపడ్డాడు. అదే సమయంలో ఇంట్లోనే ఉన్న లక్ష్మీనారాయణ కుమారుడు అశోక్ అక్కడికి చేరుకుని నిందితుల్లో ఒకడైన సమీర్‌ను పట్టుకున్నాడు. స్థానికులు కూడా అప్రమత్తమై సంఘటన స్థలానికి వచ్చారు. శివ పరారవ్వగా సమీర్‌ను అప్పగించగా రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న మరొకరి కోసం గాలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ బాలరాజ్ తెలిపారు.

క్లుప్తంగా

వేతనం అందజేత



వేతనం అందజేస్తున్న సత్యం శ్రీరంగం కోచైర్మన్ ఇందుమతి శ్రీరంగం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలోని భువన విజయం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనా రాజకుమారి గతంలో ఇద్దరు ప్రైవేట్ ఉపాధ్యాయులు, వాచ్‌మెన్‌కు వేతనాలను అందజేయాలని సత్యం శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ సత్యం శ్రీరంగంని కోరారు. ఇచ్చిన హామీ మేరకు సెప్టెంబర్ నెల వేతనాన్ని సత్యం శ్రీరంగం ఫౌండేషన్ కో–చైర్మన్ ఇందుమిత శ్రీరంగం చేతుల మీదుగా కేపీహెచ్‌బీకాలనీలో ప్రాథమిక పాఠశాలలో గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం



రాంనరేష్ నగర్‌లో యూజీడీ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్ నగర్ కాలనీలో గురువారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న పలు సమస్యలను ఆయన పరిశీలించారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోతుల రాజేందర్, నక్క శ్రీనివాస్, వెంకటయ్య యాదవ్, సత్యనారాయణ, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భెల్ హౌసింగ్ సొసైటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

శేరిలింగంపల్లి: బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల నిర్వహణాధికారిగా నియమితులైన అసిస్టెంట్ రిజిస్ట్రార్ మాధవరెడ్డి గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 17 తేదీ నుంచి మూడురోజుల పాటు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉంది. 20వ తేదీ నామినేషన్ల పరిశీలన, 21వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. 28వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

సాక్షి, సిటీబ్యూరో: కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్,, శంకర ఐ ఫౌండేషన్‌లతో కలిసి ఔపి ఎలక్ట్రానిక్స్ ఇండియా ఆధ్వర్యంలో కరీన్ రోష్ని: లైట్ ఫర్ ఎవ్రీ సైట్ అనే కార్యక్రమం చేపట్టినట్టు నిర్వాహక సంస్థ ప్రతినిధులు నగరంలో ఏర్పాటు చేసిన సమావేంలో తెలిపారు. ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నుంచి దీన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. దీని ద్వారా కంటి శస్త్ర చికిత్స అవసరమైన 14,500మందికి చేయూత అందించనున్నామని, దీని కోసం 6 ఆసుపత్రులతో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని వివరించారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

హాఫీజ్‌పేట్ : ఇటీవల కాలంలో చిన్న వయస్సులోనూ గుండె సమస్యలు వస్తున్నాయని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియనగర్‌లో ఎస్ఎల్‌జీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీఎస్ సోమరాజు, డాక్టర్ వికాస్‌కుమార్ శుక్లాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో సామాజిక దృక్పథంలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభించడం చాలా సంతోషమన్నారు. గుండె వ్యాధుల రహితంగా చేయాలన్న లక్ష్యంలో భాగంగా ఈ శిబిరం నిర్వహిస్తున్నామని ఆసుపత్రి ఈడీ డీవీఎస్ సోమరాజు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్

ఏర్పాట్లపై అధికారులకు సూచనలు



రాయదుర్గం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాయదుర్గంలోని పోలింగ్ కేంద్రాలను రంగారెడ్డిజిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సందర్శించారు. రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల భవనాల్లో ఉన్న సౌకర్యాలు, ఇతర అంశాలను ఆమె పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలనలో భాగంగా ఆమె పర్యటించారు.ఓటర్లకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.